### ఈ ప్రభుత్వం ఒక్క ఉద్యోగమిచ్చినట్టు నిరూపించినా..

# రాజకీయాలను వదిలేస్తా!

మొదటిపేజీ తరువాయి...

జనవరి 2023లో, ఏప్రిల్ 2023న మెయిన్స్ నిర్వహించారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో పోటీ పరీక్షలన్నీ పూర్తయితే.. ఇప్పుడు మీరు ఉద్యోగాల ఇచ్చామని చెప్పుకుంటున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించినందుకు మీపై రికవరీ చార్జిషీట్ వేయాలని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంట్లో ఉన్న క్యాలెండర్ మరో నాలుగు నెలలైతే మారిపోతుందని, కానీ కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్‌కే దిక్కులేదని చురకలేశారు.

#### పదేండ్ల వృద్ధికి నిదర్శనం ఆర్థిక సర్వే

రాష్ట్రంలో పదేండ్లలో జరిగిన అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం నిత్యం అసత్యాలను ప్రచారం చేస్తున్నదని, ఇది వారి గౌరవానికి, ప్రభుత్వానికి మంచిది కాదని కేటీఆర్ హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సామాజిక ఆర్థిక సర్వే' (సోషియో ఎకనామిక్ అవుట్‌లుక్) కూడా పదేండ్లలో తెలంగాణ సాధించిన అభివృద్ధికి అద్దం పడుతున్నదని పేర్కొన్నారు. భట్టి విక్రమార్క 15.3.2022న ప్రతిపక్ష నేతగా మాట్లాడుతూ.. 'ఏటా సంపద సృష్టిస్తున్న రాష్ట్రం తెలంగాణ. కరోనా దేశాన్ని అతలాకుతలం చేసినా, ఉత్పత్తిలో వెనుకడుగు వేయకుండా అభివృద్ధిని కొనసాగించారు' అంటూ కొనియాడారని, ఇప్పుడు అధికారపక్షంలో కూర్చోగానే ఆయన స్వరం మారిందని అన్నారు. భట్టి విక్రమార్క మరింత ఉన్నతిని సాధించాలని, ప్రస్తుతం కూర్చున్న కుర్చీ నుంచి భవిష్యత్‌లో పక్కనే ఉన్న కుర్చీ (సీఎం కుర్చీ) లోకి వెళ్లేలా దేవుడు శక్తిని, ఆశీర్వాదాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. 'ఎన్ని అడ్డంకులు ఎదురైనా అభివృద్ధిలో తెలంగాణ నిలబడింది.. పెట్టుబడులను ఆకర్షించింది.. ఎంప్లాయ్‌మెంట్‌ను కొనసాగింది.. వేగంగా ఆవిష్కరణలు చేసింది అని సోషియో ఎకనామిక్ అవుట్‌లుక్ స్పష్టం చేసింది' అని పేర్కొన్నారు.

#### సంక్షేమాలకు నిధులు ఏవి? ఎక్కడ?

'ఎకరానికి రూ.15 వేల భరోసాకు, నెలకు రూ.2,500 సాయానికి నిధులు ఏవి? వృద్ధులు, పెద్దలు దివ్యాంగులకు నిధులు ఎక్కడ? ఉద్యోగుల తల్లిదండ్రులకు కూడా పెన్షన్ ఇస్తామన్నారు? అవి ఎక్కడ? ఇప్పుడు ఉద్యోగులకు రైతు రుణమాఫీలో కటింగ్ పెట్టారు. రైతుభరోసాలో కూడా పెడతారంట? విద్యార్థుల విద్యాభరోసాకు రూ.5 లక్షల కార్డుకు, తులం బంగారం, స్కూటీలకు నిధులేవి? కోతలు, ఎగవేతలతో బడ్జెట్‌కు మసిపూసి మారేడుకాయ చేశారు' అంటూ కాంగ్రెస్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్‌ను వెంటనే సవరించాలని కోరారు. 'ఏకకాలంలో రుణమాఫీ చేయకపోయినా.. రెండుసార్లు పత్రికల్లో యాడ్స్ ఇచ్చాకున్నారని, అనవసర ఖర్చులు తక్కువ చేసుకోండి' అని హితవు పలికారు. 'వృద్ధులకు పెన్షన్లు పెంచుతామని చెప్పి, ఖమ్మం జిల్లాల్లో లక్ష్మమ్మ అనే మహిళ ఆసరా పెన్షన్ రికవరీ పెట్టారు. కొత్తగా ఫించన్ల రికవరీ, రైతుబంధు రికవరీ, కల్యాణలక్ష్మి రికవరీ వంటివి చేస్తున్నారు. గవర్నమెంట్ డెవలప్‌మెంట్ ఏజెంట్‌గా ఉండాలె కానీ.. రికవరీ ఏజెంట్‌గా ఉండొద్దు' అని హితవు చెప్పారు. స్కీంల మకిలి అంటించి.. స్కీంలు ఎత్తేస్తామంటే చూస్తు ఊరుకోం, వదిలిపెట్టబోం అని హెచ్చరించారు. రికవరీ చేయాల్సి వస్తే.. ప్రజలు మీ నుంచి రికవరీ చేయాలని, మీపై రికవరీ చార్జిషీటు వేయాలని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు స్వర్ణయుగం నడిచిందని, పరిస్థితిని మళ్లీ మొదటికి తీసుకురావద్దని హితవు చెప్పారు. కాంగ్రెస్ 8 నెలల పాలనలో రాష్ట్రవ్యాప్తంగా 388 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అన్యాయం మళ్లీ రైతుకు జరుగుతున్నదని, వ్యవసాయం సంక్షోభంలో పడే పరిస్థితి వచ్చిందని, రైతుల వెన్ను విరుగుతున్నదని, పల్లె కన్నీరు పెడుతున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. కల్లాల్లో ధాన్యం లేదు.. కండ్లల్లో ధైర్యం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. పదేండ్లు ఈ కష్టాలు ఎందుకులేవో ప్రజలు ఆలోచించాలని కోరారు. పరిశ్రమలకు ఇచ్చినట్టే రైతులకు కూడా ఇన్‌పుట్ సబ్సిడీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.15 వేలు ఇచ్చేందుకు బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. 26 లక్షల మంది కౌలు రైతులకు డబ్బులు ఇస్తామన్నారు.. వారిని గుర్తించారా? అని ప్రశ్నించారు.. ఫసల్ బీమా జోలికి వెళ్లొద్దని, దానిని ప్రవేశపెట్టిన గుజరాత్ వారే అదొక బక్వాజ్ పథకమని చెప్తున్నారని అన్నారు.



సభ వాయిదా పడగానే నేను, మీరు కలిసి అశోక్‌నగర్ పోదాం. అక్కడ ఉండే ఒక్క యువకుడైనా, ఏ ఒక్క చెల్లి అయినా కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చిందని చెప్తే.. నేను అక్కడే రాజీనామా చేస్తా. రాజకీయ సన్యాసం తీసుకుంటా. సిటీ సెంట్రల్ లైబ్రరీలో సీఎంకు, డిప్యూటీ సీఎంకు లక్షమందితో పౌర సన్మానం చేస్తాం. -కేటీఆర్

#### ఒక్కో మహిళకు 20 వేలు బాకీ

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు తమకెలాంటి అభ్యంతరం లేదని కేటీఆర్ స్పష్టంచేశారు. బీఆర్ఎస్ హయాంలో ఎంఎస్ఎంఈలో 40% మహిళల ఓనర్‌షిప్‌లో తెలంగాణ దేశంలోనే మొదటిస్థానంలో ఉన్నదని గుర్తుచేశారు. భారతదేశ సగటు 20% ఉంటే.. ఒక్క తెలంగాణలోనే 40% ఉన్నదని వివరించారు. కోటిన్నర లక్షల మంది మహిళలకు నెలకు రూ.2,500 వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారికి ఒక్కొక్కరికి రూ.20 బాకీ పడ్డారని, అవి కూడా చెల్లించాలని, ఆడబిడ్డల ఉసురు మంచిదికాదని హితవు చెప్పారు. దళితబంధు స్థానంలో తీసుకొచ్చిన అంబేద్కర్ అభయహస్తానికి ఇస్తామన్న రూ.12 లక్షలకు మీరు కనీసం రూ.2 వేల కోట్లు కూడా కేటాయించలేదని మండిపడ్డారు. అనవసర ప్రకటనలు ఆపితే పది దళిత కుటుంబాలు బాగుపడతాయని హితోపదేశం చేశారు.

#### చేనేతలను, బీసీలను ఆదుకోండి

'బీసీ వెల్ఫేర్ డిక్లరేషన్‌లో ఏడాదికి రూ.20 వేల కోట్ల చొప్పున రూ.లక్ష కోట్లు పెడతామన్నారు. అందులో కనీసం 50% కూడా పెట్టలేదు' అని కేటీఆర్ దుయ్యబట్టారు. రాష్ట్రంలో 15 మంది చేనేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారని, వారి కుటుంబాలను ఆదుకోవాలని, మంచి పనులకు మంగళం పాడొద్దని కోరారు.

### మాఫీలో భారీగా కోతలా?

రుణమాఫీ వ్యవహారం 'పంచపాండవులు మంచంకోళ్ల' కథలా ఉన్నది. రైతులను మోసం చేయడం ఆపండి. ఏకకాలంలో రుణమాఫీ చేయండి. కేసీఆర్ మొదటిసారి రూ.లక్ష రుణమాఫీ చేస్తేనే అయిన ఖర్చు రూ.16 వేల కోట్లు. మీరు రూ.1.5 లక్షల వరకు రుణమాఫీ చేశామంటున్నారు దానికి అయిన ఖర్చు కేవలం రూ.11 వేల కోట్లే. ఎన్ని దిక్కుమాలిన నిబంధనలు పెట్టి, ఎందరి రైతుల పొట్ట కొట్టారు. పీఎం కిసాన్ నిబంధనల ప్రకారం రుణమాఫీ అమలు చేస్తామంటే ఎలా? -కేటీఆర్

### మిమ్మల్ని అభినందించాలా? అభిశంసించాలా?

ఎందుకు మిమ్మల్ని అభినందించాలి? ఆరు నూరైనా ఆరు గ్యారెంటీలను నూరు రోజుల్లో అమలు చేస్తామని మాట తప్పినందుకా? డిక్లరేషన్లకు దిక్కుమొక్కు లేకుండా చేసిందుకా? శ్రీధర్‌బాబు చైర్మన్‌గా రాసిన 420 హామీలను తుంగలో తొక్కినందుకా? మిమ్మల్ని అభినందించడం కాదు.. అభిశంసించాలి చేశారు. మన దగ్గర రీకాల్ వ్యవస్థలేదు కాబట్టి.. మిమ్మల్ని నాలుగేండ్లు భరించాలి. -కేటీఆర్

బతుకమ్మ చీరెలు, నేతన్నకు చేయూత, చేనేత మిత్ర పథకాలకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవని,. థ్రిఫ్ట్ పథకం ఎత్తివేశారని మండిపడ్డారు. మేము తెచ్చిన మంచి పథకాల్లో వివక్ష చూపకుండా పేర్లు మార్చుకొని కొనసాగించాలని కోరారు. ఈ సందర్భంగా అలిశెట్టి ప్రభాకర్ రాసిన 'బతుకు దారాలు, దారులు తెలిగిపోయినయ్.. ముగ్గులు, మగ్గాలు మూగబోయిన్.. ఇల్లిల్లు దాటి, సిరిసిల్ల దాటి తొందరగా వెళ్లిపోవే తల్లి దసరా' అనే కవితను కేటీఆర్ చదివి వినిపించారు. 'బతుకమ్మ' అనే పేరు ఇష్టం లేకపోతే మార్చుకోవాలని, పథకాన్ని కొనసాగించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కలుగజేసుకొని చేనేతలకు బకాయిలు విడుదల చేశామని చెప్పారు. అవసరమైతే వారికొక ప్రత్యేక టెక్స్‌టైల్ పరిశ్రమ తీసుకురావాల్సి ఉన్నదని తెలిపారు. కేంద్రం కూడా సహకరించాలని కోరారు.

#### దావోస్‌లో బోగస్ పెట్టుబడులు

ప్రభుత్వాన్ని వారి అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. దావోస్‌లో రూ.40 వేల కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు చెప్పారని, ఇందులో గోడి ఇండియా కంపెనీ రూ.8 వేల కోట్లు పెట్టుబడులకు ఒప్పందం చేసుకున్నదని చెప్తున్నారని, అయితే పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన మహేశ్ గోడి అనే వ్యక్తికి సంబంధించిన ఈ కంపెనీ క్యాపిటలే రూ.1.71 కోట్లు అని, ఆ కంపెనీ రూ.27 లక్షల నష్టంలో ఉన్నదని కేటీఆర్ వివరించారు. రూ.27 లక్షల నష్టాల్లో ఉన్న కంపెనీ రూ.8 వేల కోట్లు పెట్టుబడి పెడుతున్నట్టు ఊదరగొట్టడం ఏమిటని ప్రశ్నించారు. 2022 ఏప్రిల్ 22న కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలో జేఎస్‌డబ్ల్యూ సంస్థ 1500 మెగావాట్ల కెపాసిటీతో రూ.9,500 కోట్ల పెట్టుబడి పెడుతున్నట్టు ప్రకటించిందని చెప్పారు. ఈ మేరకు ఆ సంస్థ చేసిన ట్వీట్‌ను చూపించారు. ఈ ఒప్పందాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వారి హయాంలో దావోస్‌లో చేసుకున్న ఒప్పందంగా చూపడం దారుణమని పేర్కొన్నారు. రూ.40 వేల కోట్లలో గోడి ఇండియా రూ.8 వేల కోట్లు, జేఎస్‌డబ్ల్యూ రూ.9,500 కోట్లు మొత్తం రూ.17,500 కోట్లు ఇక్కడే బోగస్ అని తేలిందని, ఇక మిగిలింది ఆదానీ పెట్టుబడులేనని ఎద్దేవా చేశారు.

#### రైతులు, నేతన్నల కుటుంబాలను ఆదుకోండి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 383 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, 15 మంది నేతన్నలు, 59 మంది ఆటో కార్మికులు మరణించారని, వీరి కుటుంబాలకు ప్రభుత్వం సాయం చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రూ.5 లక్షలు ఇస్తారో, 10 లక్షలు ఇస్తారో ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫ్రీబస్‌ను పూర్తిగా స్వాగతిస్తున్నామని, ఇంకా బస్సులు పెంచాలని కోరారు. కొత్త సర్పంచ్‌లు వచ్చేలోపు పాత సర్పంచ్‌లకు బకాయిలను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం నుంచి రూ.800 కోట్ల నిధులు వచ్చాయని, వాటిని సర్పంచ్‌లకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

#### మూసీ సుందరీకరణపై స్పష్టతివ్వాలి

మూసీని సుందరీకరణ చేయాల్సిందేనని, ప్రభుత్వ కార్యక్రమాన్ని స్వాగతిస్తున్నట్టు కేటీఆర్ తెలిపారు. తమ ప్రభుత్వంలోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, కరోనా కారణంగా ముందుకు వెళ్లలేదని చెప్పారు. నాడు తమ ప్రభుత్వం అన్నీ కలిపి రూ.16వేల కోట్లు అంచనాలు వేసిందని, ఇప్పుడు ఆ బడ్జెట్ రూ.1.5 లక్షలకు ఏ విధంగా పెరిగిందో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు సమాధానమిస్తూ.. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అంశం ఇంకా అంచనాల దశలోనే ఉన్నదని, ఇంకా డీపీఆర్‌ను రూపొందించలేదని తెలిపారు. దీనిపై కేటీఆర్ అభ్యంతరం వ్యక్తంచేశారు. భట్టి విక్రమార్క మూసీ సుందరీకరణపై డీపీఆర్ తయారు చేసినట్టు చెప్తే.. శ్రీధర్‌బాబు మాత్రం ఇంకా రూపొందించలేదని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. ఇద్దరిలో ఎవరు సభను తప్పుదోవ పట్టిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

### పాలమూరు ప్రాజెక్టుల్ని పూర్తి చేయండి

పాలమూరులో అన్ని రిజర్వాయర్లను తమ ప్రభుత్వమే నిర్మించిందని, వట్టెం, కరివెన, ఉద్దండపూర్ వరకు అన్ని రిజర్వాయర్లను నిర్మించామని కేటీఆర్ తెలిపారు. మొత్తం 31 పంపుల్లో ఒక పంపు ఆన్‌చేసినట్టు తెలిపారు. చివరి దశలో ఉన్న ప్రాజెక్టును కోల్డ్ స్టోరేజీలో పెట్టొద్దని, పాలమూరు బిడ్డలకు అన్యాయం చేయొద్దని కోరారు. మానేరును కూడా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

#### రాజకీయ దురద ఉన్నవాళ్లు చెప్తే నమ్మొద్దు

బతుకమ్మ చీరెలను సూరత్ నుంచి కొనుగోలు చేశారని, ఇందులో స్కాం జరిగిందని సీఎం వ్యాఖ్యానించగా.. అప్పుడు ఐఏఎస్ అధికారిని శైలజారామయ్యర్ దానికి బాధ్యులుగా ఉన్నారని, కావాలంటే సమాచారం తెప్పించుకొని పరిశీలించాలని కేటీఆర్ సూచించారు. తమపై రాజకీయ దురద ఉన్నవారు ఏదో చెప్తే నమ్మి మోసపోవద్దని సూచించారు. అక్టోబర్‌లో బతుకమ్మ చీరెలు పంపిణీ చేయాల్సి ఉన్నదని, తమ నిర్ణయం ఆలస్యం తీసుకోవడంతో తక్కువ సమయంలో సిరిసిల్ల చేనేత కార్మికులతో కోటి చీరలు తయారీ సాధ్యం కాదని, కాబట్టి కొంతమేర టెండర్ ద్వారా కొనుగోలు చేసినట్టు వివరించారు. పదేండ్ల పాలనపై ఎలాంటి అనుమానాలున్నా పూర్తి విచారణ చేయాలని, పూర్తిగా స్వాగతిస్తామని స్పష్టంచేశారు. ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియాకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. ఇది నాలుగైదు దశాబ్దాల కింద ఏర్పాటు చేశారని, దాని పర్పస్ పూర్తైన తర్వాత దాన్ని కన్వర్ట్ చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని స్పష్టంచేశారు. కానీ ఏ పర్పస్‌తో ఇండస్ట్రీ ఏర్పాటు చేశారో.. అది నెరవేరకుండా చేస్తానంటే చట్టం అడ్డం వస్తుందని చెప్పారు.

#### ప్రాంతం వాడే మోసం చేస్తే పాతరపెడుతాం

ఎన్నికలకు ఆర్నెళ్ల ముందు రాజకీయాలు చేద్దామని, మిగిలిన నాలుగున్నరేండ్లు నిర్మాణాత్మక ప్రతిపక్షంగా తమ పని తాము చేస్తామని కేటీఆర్ చెప్పారు. 'మాపై కోపం ఉంటే మమ్మల్ని ట్టండి. కానీ తెలంగాణ కోసం కలిసిమెలసి, కలబడి నిలబడి పోరాడిన పార్టీని అవమానించకండి. ఉద్యమంలో ఉదయించిన మా పార్టీని అవమానించకండి. కొట్లాటనే మా డీఎన్ఏలో ఉన్నది, ప్రజల పక్షాన తప్పకుండా కొట్లాడుతం. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఎక్కడ ఒక్క మోసం జరిగినా ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల తరపున మౌనం వహించం, భరించం. ప్రాంతం వాడు మోసం చేస్తే ఈ ప్రాంతంలోనే పాతరపెడుతామని గుర్తుచేస్తున్నాం' అని చెప్పారు.



### దమ్ముంటే ఆస్తులు విలువ చెప్పాలి

'ఎప్పుడూ అప్పుల గురించే కాకుండా.. దమ్ముంటే కూడబెట్టిన ఆస్తుల గురించి కూడా చెప్పండి. జీఎస్డీపీలో అప్పుల శాతం 2014-15లో 14.4% ఉండగా, ఇప్పుడు 27.8% ఉన్నది' అని కేటీఆర్ పేర్కొన్నారు. జీఎస్డీపీతో పోల్చితే అత్యధిక రుణభారం ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ కంటేముందు 15 రాష్ట్రాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రాన్ని బద్నాం చేయొద్దని, మిగులు బడ్జెట్‌తోనే కాంగ్రెస్‌కు అప్పగించామని స్పష్టంచేశారు.

**తెలంగాణ** ఆస్తుల విలువ కూడా అదే స్థాయిలో పెంచామని వివరించారు. జీఎస్డీపీ రూ.4 లక్షల కోట్ల నుంచి రూ.14.64 లక్షల కోట్ల వరకు పెరిగిందని, ఇదెందుకు విస్మరిస్తున్నారో అర్థం కావడం లేదని అన్నారు. దేశ జీడీపీ, రుణ నిష్పత్తి 59% ఉన్నదని, అమెరికా 129%, సింగపూర్ 168, జపాన్ 264%తో ఉన్నదని తెలిపారు. ద్రవ్యలోటు 2014లో 1.9% ఉంటే.. 2022-23లో 2.5% ఉన్నదని తెలిపారు. 0.6% మాత్రమే ద్రవ్యలోటు పెరిగిందని తెలిపారు. కేంద్రం ప్రభుత్వమే ద్రవ్యలోటును పూడ్చడానికి నానా తంటాలు పడుతున్నదని చెప్పారు. 'పింక్ ఆఫ్ హెల్త్‌ను క్రియేట్ చేశాం. దానిని బద్నాం చేయొద్దు. పింక్ ఆఫ్ హెల్త్ అంటే మేమంతా పింక్ ఆఫ్ హెల్తే.. మీకు పింక్ అంటే ఇష్టం లేకపోయినా తప్పని పరిస్థితి' అంటూ రాష్ట్ర పరిస్థితిని వివరించారు.

### ఫార్మాసిటీ రద్దు తిరోగమన నిర్ణయం

ప్రభుత్వం కొన్ని తిరోగమన నిర్ణయాలతో అభాసుపాలయ్యే అవకాశం ఉన్నదని కేటీఆర్ హెచ్చరించారు. ఎయిర్‌పోర్టుకు మూడు రకాల కనెక్టివిటీ ఉండాలనే ఉద్దేశంతోనే నాడు మెట్రోను విస్తరించినట్టు చెప్పారు. మైండ్‌స్పేస్ నుంచి ఎయిర్‌పోర్టుకు మెట్రోను తీసుకెళ్లడానికి కారణం ఐటీ ఉద్యోగులని తెలిపారు. సుమారు 10 లక్షల మంది ఐటీ ఉద్యోగులు నిత్యం ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. మైండ్‌స్పేస్ నుంచి శంషాబాద్ వరకు, ఫలక్‌నుమా నుంచి ఎయిర్‌పోర్టుకు, హయత్‌నగర్ నుంచి ఎయిర్‌పోర్టుకు రావడానికి వీలుగా రూట్ రూపొందించినట్టు వివరించారు. దానిని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని, ఒకసారి పునరాలోచన చేయాలని కోరారు. ఫార్మా సిటీ రద్దు విషయంలో కూడా మరోసారి ఆలోచన చేయాలని విజ్ఞప్తిచేశారు. ఫార్మాసిటీ కోసమే భూములు తీసుకుంటున్నామని భూసేకరణ చట్టం ద్వారా సేకరించినట్టు తెలిపారు. ఈ విషయంపై లీగల్ అడ్వైజ్ తీసుకోవాలని సూచించారు. 'ఫార్మాసిటీ భూములు తిరిగి వెనక్కి ఇస్తామన్నారు. చట్టప్రకారం తీసుకున్నాం కాబట్టి.. ప్రభుత్వపరంగా ఏమైనా ఇబ్బందులొస్తాయేమోనని లీగల్‌గా వెళ్లమని చెప్తున్నాం' అని స్పష్టంచేశారు.



### కేటీఆర్ పంచ్‌లు

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పదునైన మాటలు, గుండెను తాకే వాగ్బాణాలను ప్రభుత్వంపై ఎక్కుపెట్టారు. వాటిలో కొన్ని..

- ఉద్యమాలతో ఉదయించిన తెలంగాణ.. ఉజ్వల తెలంగాణగా అవతరించింది
- శుష్కప్రియాలు, శూన్య హస్తాలు.. గ్యారెంటీలకు టాటా.. లంకెబందెల వేట.
- డిక్లరేషన్ల డీలా.. దైవర్షన్ల మేలా..
- హమీపత్రాలకు పాతర.. శ్వేతపత్రాల జాతర.
- నిరుద్యోగుల మీద నిర్బంధాలు.. జర్నలిస్టుల మీద దౌర్జన్యాలు.. విమర్శిస్తే కేసులు, ప్రశ్నిస్తే దాడులు, నేతన్నల ఆత్మహత్యలు, ఆటో అన్నల బలవన్మరాలు.
- ఓట్లకు ముందు అభయహస్తం.. ఓట్లు పడ్డాక శూన్య హస్తం
- మ్యానిఫెస్టోలో అరచేతిలో స్వర్గం.. బడ్జెట్‌లో మోచేతికి బెల్లం
- మూడు తిట్లు.. ఆరు అబద్ధాలు కాంగ్రెస్ బడ్జెట్‌లో కనిపిస్తున్నాయి
- సిరిగల్ల తెలంగాణను, లక్ష్మీకళ గల తెలంగాణను దివాలా తీసిందని చెప్పడం భావ్యం కాదు
- బుట్టలో ఓట్లు వేయించుకొని.. గెలిచాక బుట్టదాఖలు చేశారు.
- దళితులకు ద్రోహం, మహిళలకు మోసం, నిరుద్యోగులకు నయవంచన, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు కొండంత, గ్యారెంటీ కార్డులు, డిక్లరేషన్‌లు చాంతాడంతా. కానీ బడ్జెట్‌లో కేటాయింపులు గోరంతనే..
- అసెంబ్లీలో నాలుగు గోడల మధ్య కూర్చొని నాలుగు కోట్ల మందిని మోసం చేస్తే కచ్చితంగా నిలదీస్తాం, ప్రశ్నిస్తాం.
- అన్నవస్త్రాల కోసం పోతే.. ఉన్న వస్త్రాలు పోయినట్టుంది.'ఉండబట్టలేక ఓటేస్తే.. ఉన్నబట్ట కూడా లాక్కున్నట్టుంది.
- జాబుల జాతర పెట్టిస్తారనుకుంటే అబద్ధాల జాతర నడుస్తున్నది.
- ఇంట్లో ఉన్న క్యాలెండర్ మరో నాలుగు నెలలైతే మారిపోతుంది కానీ, కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్‌కు దిక్కులేదు.
- కల్లాల్లో ధాన్యం లేదు.. రైతు కండ్లలో ధైర్యం లేదు
- నాట్లు పడేటప్పుడు వచ్చే రైతుబంధును.. ఓట్లు పడేటప్పుడు వేశారు
- మహాలక్ష్ములకు మోసం, తులం బంగారం తూచ్ అయిపోయింది
- అమ్మాయిలకు స్కూటీలు లేవుగాని వారిపై లాఠీలు ప్రయోగిస్తున్నరు
- సాంచాల మీద సప్పుళ్లు ఆగిపోయె, మగ్గాల మీద మరణమృదంగం మోగె.

# డెవలప్‌మెంట్ ఎక్స్‌పెండేచర్‌లో తెలంగాణ టాప్

### సంక్షేమంపై దృష్టిసారించండి

కేటీఆర్ డిమాండ్

- గొల్ల కురుమలకు మళ్లీ గొర్రెలు పంపిణీ చేయాలి. అక్రమాలు జరిగితే వాటిపై ప్రభుత్వం చర్య తీసుకోవాలి. ప్రతిపక్షంగా పూర్తిగా సహకరిస్తాం.. కానీ పథకం ఆపొద్దు.
- గౌడన్నలకు మేలు జరిగేలా కల్లు దుకాణాలతోపాటు నీరాను విస్తరించాలి. గౌడన్నలకు 25% రిజర్వేషన్ వైన్‌షాపుల్లో ఇస్తామన్నారు. ఆ మాటను నిలబెట్టుకోవాలి.
- ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏకి మార్చాలి. మత్స్య సంపద పెంపులో బీఆర్ఎస్ కృషి చేసింది. దానిని ఇంకా పెంచాలి.
- బీసీ కులగణన త్వరగా పూర్తి చేయాలి. వాటికి నిధులు కేటాయించాలి. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో కుల గణనపై ప్రభుత్వ వైఖరి చెప్పాలి.
- గిరిజనులకు అభయహస్తం కింద రూ.12 లక్షలు ఇవ్వాలి. మా హయాంలో నాలుగున్నర లక్షల ఎకరాలకు పోడు పట్టాలు ఇచ్చాం. వాటికి రైతుబంధు కూడా ఇచ్చాం. వాటికి రైతుభరోసా కొనసాగిస్తారా? లేదా? అనేది స్పష్టంచేయాలి.
- మైనార్టీ సబ్‌ప్లాన్ తీసుకురావాలి. ప్రత్యేకంగా మైనార్టీలకు ఒక మంత్రిని కేటాయించాలి. ఇది మైనార్టీ మంత్రి లేని మొదటి ప్రభుత్వం కాబట్టి.. ఆ దిశగా ఆలోచన చేయాలి.



#### రెవెన్యూ రాబడుల్లోనూ ముందంజ

**సొంత రెవెన్యూ రాబడులతో ఎవరి మీద ఆధారపడకుండా బతుకుతున్న రాష్ట్రం తెలంగాణ అని కేటీఆర్ స్పష్టంచేశారు. 84% సొంత రాబడులతో దేశంలోనే మొదటి మూడు స్థానాల్లో తెలంగాణ ఉన్నదని చెప్పారు. కేంద్ర పన్నుల్లో వాటా, నాన్ ట్యాక్స్ రెవెన్యూ, సబ్సిడీలు వంటివి కలిపితే.. మనది లోటు బడ్జెట్ రాష్ట్రమా? మిగులు బడ్జెట్ రాష్ట్రమా? అనేది తేలిపోయిందని చెప్పారు.**

**నాడు** తెలంగాణ రెవెన్యూ రూ.46 వేల కోట్లు అని.. పదేండ్ల బీఆర్ఎస్ పరిపాలనలో రూ.1.60 లక్షల కోట్లు అని గుర్తుచేశారు. సొంత రాబడుల్లో నేటికీ తెలంగాణ దేశంలోనే అగ్రభాగాన ఉన్నదని స్పష్టంచేశారు. '2014లో రెవెన్యూ సర్‌ప్లస్ రూ.369 కోట్లతో మాకు అప్పగిస్తే.. రూ.5,944 కోట్ల రెవెన్యూ సర్‌ప్లెస్‌తో మీకు ఇచ్చాం' అని పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌లో కూడా రెవెన్యూ మిగులు రూ.297 కోట్లుగా చూపించారని పేర్కొన్నారు. 'రెవెన్యూ రిసీట్స్‌లోంచి రెవెన్యూ ఎక్స్‌పెండేచర్‌ను తీసేస్తే మిగిలిందే కదా రెవెన్యూ సర్‌ప్లస్. రాష్ట్రం అప్పులపాలైందని ఊదరగొడితే ఎలా?' అని కేటీఆర్ ప్రశ్నించారు. 2021 వరకు జీతాలు ఒకటో తేదీన ఇచ్చామని, కరోనా సృష్టించిన ఆర్థిక సంక్షోభం వల్ల 2021 నుంచి 2023 వరకూ జీతాలు ఇవ్వడంలో ఆలస్యమైందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ఇప్పటికీ చిరుద్యోగులకు, వైద్యశాఖలోని కాంట్రాక్ట్ సిబ్బందికి నెలలుగా జీతాలు అందడం లేదని చెప్పారు.

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): గత బీఆర్ఎస్ పాలన ఫలితంగా డెవలప్‌మెంట్ ఎక్స్‌పెండేచర్‌లో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని కేటీఆర్ వివరించారు. అసెంబ్లీలో బుధవారం ద్రవ్య వినిమయ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'ఉద్యమాలతో ఉదయించిన తెలంగాణ.. ఉజ్వల తెలంగాణగా అవతరించింది. పదేండ్లలో సొంత కాళ్లపై నిలబడింది. విజయవంతమైన రాష్ట్రంగా నిలిచింది. భారతదేశ భాగ్యరేఖలు మార్చే రాష్ట్రంగా నిలబడటం మనందరి అదృష్టం' అని కేటీఆర్ చెప్పారు. 2014లో రాష్ట్ర జీఎస్డీపీ రూ.4 లక్షల కోట్లు ఉంటే, 2024 నాటికి రూ.14.64 లక్షల కోట్లకు పెంచామని గుర్తుచేశారు. అత్యధిక తలసరి ఆదాయం కలిగిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని, ప్రభుత్వం విడుదల చేసిన నివేదికే దీనికి సాక్ష్యమని చెప్పారు. దేశ జీడీపీ వృద్ధికి ఊతమిస్తున్న రాష్ట్రంగా, దేశాన్ని సాదుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా తెలంగాణ ఉన్నదని నివేదకలో చెప్పినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. 'దివ్యంగా ఉన్న రాష్ట్రాన్ని దివాలా తీసిందని ప్రచారం చేస్తున్నారు. ఆస్తులు దండిగా ఉన్న రాష్ట్రాన్ని, అప్పుల ఊబిలో ఉన్నదని అంటున్నారు. ఆ ప్రచారం శుద్ధ తప్పు అని మీరు విడుదల చేసిన సోషియో ఎకనమిక్ అవుట్‌లుక్ చెప్తున్నది. అంకెలు అబద్ధాలు ఆడవు.. సత్యాల మీద ముసుగు వేయడం మంచిది కాదు' అని హితవు పలికారు. ఆర్బీఐ గణాంకాలు, కాగ్ నివేదికల్లో తెలంగాణ అభివృద్ధిని కొనియాడారని, డెవలప్‌మెంట్ ఎక్స్‌పెండేచర్‌లో తెలంగాణ 74%తో టాప్‌లో ఉన్నదని వివరించారు. జీతాలకు పైసలు లేవని, అప్పులు తీర్చేందుకు అప్పులు చేస్తున్నట్టుగా తప్పుదోవ పట్టించడం సరికాదని హితవు చెప్పారు. జీతాలు, పెన్షన్లు, కిస్తీలు వంటివి కలిపి కమిటెడ్ ఎక్స్‌పెండేచర్‌గా పిలుస్తారని.. ఒక రూపాయిలో కమిటెడ్ ఎక్స్‌పెండేచర్‌లో 47 పైసలు అయితే, మిగతా 53 పైసలు అభివృద్ధి చేయడానికి అందుబాటులో ఉన్నాయని కేటీఆర్ వివరించారు. కేరళ కమిటెడ్ ఎక్స్‌పెండేచర్ రూపాయిలో 82 పైసలు ఉంటే, హర్యానా 81 పైసలు, పంజాబ్ 79, పశ్చిమ బెంగాల్ 69, తమిళనాడు 62, ఏపీ 61, రాజస్థాన్‌లో 52 పైసలుగా ఉన్నదని వివరించారు. దేశ సగటులో కమిటెడ్ ఎక్స్‌పెండేచర్ 56 పైసలుగా ఉన్నదని చెప్పారు. కమిటెడ్ ఎక్స్‌పెండేచర్ అత్యల్పంగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ టాప్-4లో ఉన్నదని గుర్తు చేశారు. తిమ్మినిబమ్మిని చేసి, మోసం చేస్తామంటే కుదరదని హెచ్చరించారు. ఒకవైపు ద్రవ్యలోటు ఉన్నదంటూనే.. మరోవైపు డెవలప్‌మెంట్ ఎక్స్‌పెండేచర్‌లో 74%తో తెలంగాణ మొదటిస్థానంలో ఉన్నదని ప్రభుత్వం చెప్తున్నదని గుర్తు చేశారు. పరస్పర విరుద్ధంగా నివేదిక రూపొందించారని, ఇందులో ఏది నిజమో కాంగ్రెస్ నేతలే చెప్పాలని డిమాండ్ చేశారు.

### ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలి

మా ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ అమలు చేస్తే నాడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉచితంగా చేయాలని డిమాండ్ చేశారు.. 'నో ఎల్ఆర్ఎస్- నో టీఆర్ఎస్' అని స్లోగన్ ఇచ్చారు. ఇప్పుడు అధికారంలోకి రాగానే డబ్బులు వసూలు చేస్తున్నారు. 25 లక్షల దరఖాస్తుదారులకు గతంలో ఇచ్చిన మాట ప్రకారం ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేయాలి. -కేటీఆర్

#### రాబడులకు లోబడే అప్పులు

'బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు రెవెన్యూ రిసీట్స్‌లో లోబడే ఉన్నాయి. రెవెన్యూ సర్‌ప్లెస్ ఉన్నా.. సొంత వనరుల వినియోగంలోనూ తెలంగాణ టాప్‌లో ఉన్నదనే విషయాన్ని గుర్తించాలి' అని కేటీఆర్ పేర్కొన్నారు. 'నికర అప్పు రూ.6.71 లక్షల కోట్లు ఉందనేది పచ్చి అబద్ధం. ప్రభుత్వం చెల్లించాల్సిన అవసరం లేనివాటిని కూడా అప్పుల్లో చేర్చారు. ఇది అత్యంత దారుణం. మా హయాంలో మొత్తం నికర అప్పు రూ.3.85 లక్షల కోట్లే' అని స్పష్టంచేశారు. బయట ఏం మాట్లాడినా.. సభలో అబద్ధాలు చెప్పొద్దని హితవు పలికారు. తెలంగాణ అప్పులతో దివాలా తీసిందంటే ఒక్క వ్యాపారైనా పెట్టుబడి పెట్టడానికి వస్తాడా? అని ప్రశ్నించారు. అప్పులు తీసుకొని మంచినీళ్లు, తాగునీరు, సాగునీరు ఇచ్చామని తెలిపారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేశామని, హెల్త్‌కేర్ ఇచ్చామని తెలిపారు. అప్పులు తెచ్చి పప్పుకూడు తినలేదని, సంపద సృష్టించామని తెలిపారు. దేశంలోనే తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్న మొదటి రాష్ట్రం తెలంగాణ అని సగర్వంగా చెప్పగలనని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి వెనుకబడిన జిల్లా కూడా భారతదేశ సగటుకంటే ముందున్నదని స్పష్టంచేశారు. నీతి ఆయోగ్ విడుదల చేసిన 'నో పావర్టీ ఇండెక్స్'లో తెలంగాణ రెండో స్థానంలో నిలిచిందంటే బీఆర్ఎస్ పరిపాలన గొప్పతనమని చెప్పారు.

### ప్రజలు మాకు బుద్ధి చెప్పే రోజులొస్తే : సీతక్క

**ఉద్యోగాల** కల్పనపై కేటీఆర్ మాట్లాడుతుంటే.. మధ్యలో సీతక్క ఉద్యోగాలు, పెన్షన్ల రికవరీ గురించి కలుగజేసుకున్నారు. పెన్షన్ల రికవరీ తమ దృష్టికి రాలేదని, అధికారులు చేస్తున్నారేమోనని తెలిపారు. 'ఇంకా మాకు సమయం ఉన్నది. అంతా చేస్తాం. ఆరు నెలల్లో కొన్ని సాధ్యం కాలేదు. ప్రజలు మాకు బుద్ధి చెప్పేటప్పుడు చెప్తారు కానీ, మీరు విమర్శలు ఆపండి' అని వ్యాఖ్యానించారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ.. 'మంత్రులకు ఓపిక ఉండాలి. ప్రజల తరపున అడగటమే మా ధర్మం. మిమ్మల్ని వందరోజుల్లోనే ఇచ్చిన హామీలు పూర్తి చేయాలని గడువు ప్రజలు అడిగారా? మీరు ఓట్ల కోసం అడ్డగోలు మాటలు చెప్పారు. అడిగితే కంగారు ఎందుకు పడుతున్నారు' అని ప్రశ్నించారు.